# ఔన్నత్యం

-ఊర్మిళా సుభాన్.

**చాలా రోజుల తర్వాత ఆ రోజు ఇంటికి వచ్చింది రమణమ్మ. ముఖం దిగులుగా ఉంది.**

"ఏమ్మా! ఆరోగ్యమెలా ఉంది? ఈ మధ్య కనిపించడమే లేదు!" అంటూ అడిగాను.

ఆ మాత్రం పలకరింపుకే చలిగాలి తగిలిన మేఘంలా వర్షించాయి ఆమె కళ్ళు.

"ఏమ్మా! ఏమైంది?" భుజంపై చేయివేశాను.

ఆ వయసులో ఆవిడ కన్నీరు పెట్టుకోవడం చాలా బాధ అన్పించింది నాకు. నా చేతిని గట్టిగా పట్టుకుంది ఆసరా లభించినట్లు... ఒలికిపోయిన ఆత్మీయత లభించినట్లు.

"మా వినాయక్ నన్ను ఆశ్రమంలో చేర్పిస్తాడటమ్మా"

"ఆశ్రమంలోనా! ఇంత మంది ఉండి.. ఎవరూ లేని అనాధలా... పైకి అనలేదింకా.

"నీకు తెలుసు కదమ్మా... నాకు పిల్లల్లేరు. ఉన్న ఆస్తిని పరుల పాలు చేయడమెందుకని విధవరాలైన చెల్లిని... పిల్లల్నీ పోషించి... చదివించి... నా పిల్లలే అన్న భావంతో ఆస్తి కూడా పంచి ఇచ్చాను. ఇంతకాలం నాతో ప్రేమగానే ఉన్నారా? నాకంటూ ఏమీ మిగుల్చుకోకుండా పంచాక.. ఇప్పుడు నేను వాళ్ళకు పనికిరాని దాన్నై పోయాను..." వెక్కిళ్ళ స్పీడ్ బ్రేకర్‌కి ఆగింది రమణమ్మ.

ఇదంతా నాకు తెలిసిన కథే. ముందే చెప్పాను కూడా నేను... 'అప్పుడే ఎందుకు పంచుతావు! నీకు బాగాలేకపోతే... అవసరానికి కావద్దూ... పంచి ఇచ్చాక వాళ్ళదే అవుతుంది కానీ నీది కాదు' అనీ...

విన్పించుకోక పోగా నన్నే నిష్టూరంగా మాట్లాడింది.. 'కడుపున పుట్టకపోయినా వాళ్ళు నా పిల్లలే... తల్లిని పట్టించుకోని పిల్లలు ఎక్కడైనా ఉంటారేమో కానీ... నా పిల్లలు అలాకాదు..' అంటూ సమర్థించింది ఆవిడ ఆనాడు.

కాస్సేపు ఊపిరి తీసుకుని మళ్ళీ మొదలుపెట్టింది రమణమ్మ "ఇప్పుడు నేను పూచిక పుల్లతో సమానమై పోయానమ్మా... ఇప్పుడు నేను కదిలినా తప్పే... కదలక పోయినా తప్పే.. ఎవరితో ఏం మాట్లాడాలన్నా భయమే... ఏ పుస్తకం ముట్టుకోవాలన్నా భయమే.. చివరికి... నాకిష్టమైన తిండి తినాలన్నా 'వయసు మీరినా తిండియావ చావలేద'ని వెక్కిరింత."

ఏడుపు ఎగదన్నడంతో మాటలాగిపోయాయి.

నాకూ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక్కోసారి బాధకంటే బాధపడుతున్నామన్న ఫీలింగే బాధాకరంగా ఉంటుంది.

ప్రస్తుతం రమణమ్మ స్థితి అలాగే ఉన్నట్లుంది.

"నా మరిది తాగుబోతై చిల్లిగవ్వ మిగల్చకుండా చనిపోతే. నాభర్త వద్దన్నా వినకుండా చేరదీశాను. లేకపోతే వీళ్ళంతా ఈరోజు ఏ స్థితిలో ఉండేవారో! ఓ అనాధ శిశువును పెంచుకుందామని ఆయనెంతగానో చెప్పారు. విన్పించుకున్నాను కాదు. ఎవరి పిల్లలో... ఎవరి పాపఫలమో... మన ఆస్తినెందుకు అనుభవించాలని అనుకున్నానే తప్ప... అప్పుడే ఆయన మాటలు వినివుంటే... పెంచిన ప్రేమతోనో, విశ్వాసంతోనో ఈ వృద్ధాప్యంలో నాకు ఆదరణ దొరికి ఉండేదేమో!"

ఆవిడ ఆస్తి హాయిగా అనుభవిస్తూనే... ఆవిడను అసహ్యించుకుంటున్న వారి మనస్తత్వం నీచంగా అన్పించింది నాకు.

ఈ నిడేం పరాయిది కాదు... తల్లి రక్తం పంచుకుని పుట్టినది... దిక్కులేని స్థితిలో తమను ఆదుకుని ఆదరించింది.

అమ్మకు ముసలి తనంలో ఉంది.. మహా అయితే ఏడాది.. రెండేళ్ళు బ్రతకవచ్చు. ఈ కొద్ది కాలం... ఆవిడ ఖర్చులు భరించలేక అనాధాశ్రమంలో చేర్పించాలన్న ఆలోచన... వారికెందుకు బాధ కల్గించలేదో అర్థంకాలేదు నాకు.

ఈ లోకంలో ఆత్మీయత, అభిమానం, రక్త సంబంధం.. అన్నీ డబ్బు ముందు బలాదూరే... ఎవరిమీదో తెలియని కోపం వచ్చింది నాకు... వెంటనే ఓ ఆలోచన.



"పోనీ!" ఒక పని చేస్తేనో?"

ఏమిటన్నట్లు చూసింది రమణమ్మ.

"మీరెవరితో వీలునామా రాయించారో అదే లాయరుని పిలిచి రద్దుచేయించండి.. అలా వీలునామా మార్చుకోవచ్చు మనకిష్టమైతే."

నా పరిజ్ఞానాన్ని ఆవిడముందు పెట్టి... తన ముఖంలో వెలిగే సంతోషం కోసం ఎదురు చూశాను.కానీ నిరాశే ఎదురైంది నాకు.

"పోనీలేమ్మా! ముసిల్దాన్ని... ఎన్నాళ్ళు బ్రతుకు తాను? డబ్బుతో ఏం అనుభవిస్తాననీ? ఇన్నాళ్ళూ డబ్బుతో పెరిగారు... ఒక్కసారిగా లాక్కుని గెంటివేయడం ఏం బాగుంటుంది? ఎక్కడని అవస్థ పడ్తారు పాపం... అది కాదమ్మా నన్ను బాధపెడ్తున్నది... పలుచబడిన ఆత్మీయతే... నన్నింతగా ఏడ్పిస్తున్నది... ఆస్తి పోయిందని కాదు... చివరి దశలో.. వద్దనుకున్న ఒంటరితనమే దక్కింది. పోనీలే... ఎవరి పాపం వారిదే... ఎంత కాదనుకున్నా నా పిల్లలేగా.. నా పిల్లలకు నేను శాపం పెట్టుకోనా? వద్దు తల్లీ... వద్దు.. వాళ్ళైనా హాయిగా ఉంటే అంతేచాలు...రేపు వెళ్ళిపోతున్నానమ్మా! ఇదే... చివరిసారి చూడ్డం.. అందుకే.. వచ్చాను.. అంతదూరం వచ్చి నీవేం చూస్తావులే... అప్పుడప్పుడూ గుర్తుతెచ్చుకో చాలు.. వస్తాను తల్లీ. "ముఖం తుడుచుకుని లేచింది రమణమ్మ తేటపడిన ముఖంతో.

ఆవిడకేదో సహాయమూ... వారికేదో శిక్షా... వేయించాలన్న నా ఆలోచనకు నన్నే సిగ్గుపడేలా చేసి... మసకబారిన నా కళ్ళకు అస్పష్టంగా కన్పించింది రమణమ్మ... ఆవిడలోని ఔన్నత్యమూ... ఔదార్యమూ!

✪


## జోక్



**తెలుగు మాస్టారు:** "గోపీ, నిశాచరుడంటే ఎవర్రా?"

**గోపి :** "మరేనండీ, నిశాచరుడంటే 'నిష'తో చరించే వాడండీ అంటే తాగుబోతండి."

**-బి.చంద్రశేఖర్**



## వృక్షో రక్షిత రక్షితః

మానవుడు తన స్వార్థం కోసం ప్రకృతి సంపదలైన వృక్షాలను నరికేస్తూ తద్వారా తన వినాశనాన్ని తనే కొనితెచ్చుకుంటున్నాడు. అంతరిస్తున్న వృక్షాలను ఆపటం సాధ్యమయ్యే పనికాదు. కానీ పర్యావరణాన్ని రక్షించటానికీ దేశాన్ని పచ్చదనం చేయటానికీ భారత దేశంలో ఓ పౌరుడిగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి పూనుకున్నాడు దిలీప్ శర్మ. ఇరవై ఆరేళ్ళ దిలీప్ శర్మ రాజస్థాన్ రాష్ట్రంలోని జిలాబర్స్ అనే చిన్న గ్రామానికి చెందినవాడు. సైకిల్ మీద దేశ వ్యాప్తంగా ఐదు లక్షల కిలోమీటర్లు ప్రయాణించి, యాభై ఆరు లక్షల మొక్కలు నాటాలని జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాడు. తన లక్ష్యం ప్రభుత్వాధికారులకుచెప్పి వారి సహాయం అడిగాడు కానీ ప్రభుత్వాధికారుల దగ్గర నుంచి దిలీప్‌కి సంతృప్తికరమైన సమాధానం రాలేదు. తల్లిదండ్రుల, స్నేహితుల సహకారంతో కొంత డబ్బు చేతపుచ్చుకుని ,1994 జులై 29న సైకిల్‌పై తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఇప్పటికి దిలీప్ రాజస్థాన్‌తో మొదలుపెట్టి హర్యానా, ఢిల్లీ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాలలో పర్యటించాడు. తను నాటే మొక్కలను స్థానికంగా ఉండే నర్సరీలనుండి, స్థానిక ప్రభుత్వ కార్యాలయాల నుండి తీసుకుని తనే నేలను తవ్వి మొక్కను నాటుతాడు. కొన్ని చోట్ల స్థానిక పాఠశాల విద్యార్థుల సహకారం తీసుకుంటున్నాడు. తాను ప్రయాణించిన రాష్ట్రాలన్నింటిలోకెల్లా జమ్మూ-కాశ్మీర్ పచ్చగా ఉందని చెప్పాడు దిలీప్.

వాతావరణం సహకరిస్తే రోడ్డు మీద రోజూ నూటా తొంభై కిలోమీటర్లు, పర్వత ప్రాంతాలలో అయితే నూటా ఇరవై కిలోమీటర్లు ప్రయాణించ గలనంటున్నాడు.

యాభై ఆరు లక్షల మొక్కలు నాటితే, అప్పటికి తనకు యాభై ఆరేళ్ళు వస్తాయనీ, తనను ఎద్దేవా చేసిన వారి మాటలే తనలో పట్టుదల పెంచి తనను ముందుకు నడుపుతున్నాయనీ అంటున్నాడు దిలీప్ శర్మ.

**-డి.వి.ఎల్.నరేంద్ర**